పాదచారులకు దారేదీ?

- ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు
- రాజకీయ అండతో పాగా వేసేస్తున్న వైనం
- నోరు మెదపని మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు
- తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు



జెడ్పీ సెంటర్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన టీడీపీ నాయకుడు



జెడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఫుట్‌పాత్‌పైనే టీస్టాల్ బల్లల ఏర్పాటు

ఏలూరు (టూటౌన్): నగరంలో ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలను వదలని వ్యాపారులు. రాజకీయ అండదండలతో యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఆయా మార్గాల గుండా ప్రయాణించే పాదచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగించడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కుచించుకు పోతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. ఏలూరులో ఈ సమస్యకు చెక్ పెట్టేది ఎవరా అని ప్రజలు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. సాధారణ పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు అవకాశం లేదు. ఈ కారణంగా ట్రాఫిక్‌లో రోడ్లపైనే జాగ్రత్తగా నడవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. సామాన్యులు ఎవరైనా రోడ్డు పక్కన తోపుడు బండి, బుట్టల్లో పెట్టుకుని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు వంటివి విక్రయిస్తే వెంటనే తొలగించేస్తున్న అధికారులు ఫుట్‌పాత్, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారం సాగిస్తున్నవారి పట్ల మాత్రం నోరు మెదపడం లేదు.

ట్రాఫిక్‌కు అంతరాయం

నగరంలో నిత్యం రద్దీగా ఉండే జెడ్పీ సెంటర్, ఇండోర్ స్టేడియం రోడ్డు, ఎస్‌బీఐ సెంటర్, ఆర్‌ఆర్ పేట, పవరుపేట, అశోక్ నగర్ రోడ్డు, వన్‌టౌన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యాపారాలు చేసే వారంతా చోటామోటా రాజకీయ నాయకులే. వారంతా పలుకుబడి ఉన్న వారు కావడంతో వీరి పట్ల అధికారులు ఎంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఏదైనా సైకిల్‌పైనో, తోపుడు బండిపైనో, బుట్టలోనే చిన్న వ్యాపారాలు చేసేవారు పొరబాటున రోడ్డు పక్కన ఆగితే చాలు ఆగమేఘాల మీద వారిని అదిరించి, బెదిరించే పోలీసులు ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలు ఆక్రమించి వ్యాపారాలు చేసేవా రిపట్ల ఎంతో సానుకూలంగా ఉండటం కొసమెరుపు. రాజకీయ వత్తిళ్లే దీనికి కారణమనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

రాజకీయ పలుకుబడితో ఫుట్‌పాత్ ఆక్రమణ

రాజకీయ పలుకు బడి ఉన్న టీడీపీ నాయకుడొకరు యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ షాపింగ్ మాల్ వద్ద ఈ నాయకుడు రెండు షాపులను అద్దెకు తీసుకున్నారు. ఈ రెండు షాపులకు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌లపై లైటింగ్ కోసం స్టీల్ రాడ్లు, అలంకరణగా పూల కుండీలు ఏర్పాటుచేసి మొత్తం ఫుట్‌పాత్‌ను ఆయన ఆక్రమించారు. దీంతో ఈ షాపుల్లోకి వచ్చే వారు తమ బండ్లను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. ఈయన షాపుల పక్కనే మరొక పలుకుబడి ఉన్న నాయకుడు హోటల్ నడుపుతున్నారు. ఆయన టీ స్టాల్ మాత్రం పూర్తిగా ఫుట్‌పాత్‌పైనే పెట్టారు. దీనికి తోడు టీ తాగేందుకు, ఖాళీ గ్లాసులు పెట్టేందుకు ఏర్పాటు చేసే టేబుళ్లు ఫుట్‌పాత్‌పైనే ఉంచారు. దీంతో ఈ హోటల్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు పైనే నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. నిత్యం జిల్లా అధికారులు వచ్చి వెళ్లే మార్గంలోనే ఇంత జరుగుతున్నా ఎవరు నోరు మెదపని పరిస్థితి.

ప్రజల ఇబ్బందులను తొలగించాలి



పేదలకు ఒక న్యాయం డబ్బు, రాజకీయ,అధికార పలుకుబడి ఉన్న వారికి మరొక న్యాయం తగదు. చిరువ్యాపారులుపై జులుం ప్రదర్శించే మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల కంటికి ఆక్రమణదారుల ఆగడాలు కనబడటం లేదు. ఇప్పటికైనా పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలుగని విధంగా ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలపై చేస్తున్న వ్యాపారాలను తొలగించాలి. ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– బి.జగన్నాథరావు, సీఐటీయూ నాయకులు, ఏలూరు

ఫుట్‌పాత్‌లపై నడిచే అవకాశం లేదు



నగరంలోని అన్ని ప్రధాన రహదారుల వెంబడి రూ.కోట్లు వెచ్చించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అవి ఆక్రమణల చెరలో ఉండటంతో కనీసం ఫుట్‌పాత్‌లపై ప్రజలు నడిచి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. గతంలో జెడ్పీ సెంటర్ నుంచి కలెక్టరేట్ సెంటర్ నుంచి ఇటు కొత్త బస్టాండ్ వరకు చుట్టూ నడిచే విధంగా ఫుట్‌పాత్‌లు ఉండేవి. తాజాగా కొత్త బస్టాండ్ నుంచి జెడ్పీ సెంటర్, ఇండోర్ స్టేడియం వరకు వెళ్లే మార్గంలోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి.

– కొరబండి బాబూరావు, దళిత ఉద్యమ నాయకులు, ఏలూరు

క్లుప్తంగా

ఘనంగా భూలోకమ్మ సంబరాలు



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జేపీని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 2వ డివిజన్‌లో వేంచేసియున్న భూలోకమ్మవారి సంబరాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి స్థానికులు నైవేద్యాలు సమర్పించి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి వేషధారణలు, బాణసంచాతో ఊరేగింపు డివిజన్‌లోని అన్ని వీధుల్లో నిర్వహించారు. సంబరాల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి సంబరాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానికులు ఏటా ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.జయప్రకాష్‌ను కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పల్లి శ్రీను, పి.రాజేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్ అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ కనిపించకపోవటంతో భర్త ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న నిమ్మగడ్డ నాగేశ్వరరావు లింగపాలెం మండలం నడిపల్లిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. అతని భార్య బాల స్వాతి (38) ఏలూరు చాటపర్రు రోడ్డులోని ఒక ప్రైవేటు స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నారు. భార్య బాలస్వాతి రెండు రోజుల నుంచి కనిపించకపోవటంతో బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించక ఆమె భర్త నాగేశ్వరరావు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాల స్వాతి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టులో దురుసుగా ప్రవర్తించిన నిందితుడు

ఏలూరు టౌన్: హత్యా కేసులో ప్రధాన నిందితుడిగా ఉంటూ కోర్టు వాయిదాకు వచ్చిన సందర్భంలో మద్యం తాగి వచ్చి న్యాయస్థానంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో కోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఏలూరులో ఒక హత్యా కేసులో నిందితుడిగా ఉన్న తూర్పువీధికి చెందిన తిరుమల రామశివ (38) ఏలూరు జిల్లా కోర్టుకు కేసులో వాయిదాలకు వస్తున్నాడు. ఈనెల 13న కోర్టు వాయిదాకు వచ్చిన రామశివ పూటుగా మద్యం తాగి కోర్టులో దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు అడవి బాపిరాజు నుంచి ప్రేరణ పొందాలి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన నిర్వాహకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ చిత్రకారుడు అడవి బాపిరాజు నుంచి విద్యార్థులు ప్రేరణ పొందాలని మైక్రో ఆర్టిస్టులు మేతర సురేష్, వి.ప్రసాద్ అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంస్థల ఆధ్వర్యంలో నవచైతన్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గాంధీనగర్ హైస్కూల్లో అడవి బాపిరాజు 72వ వర్ధంతి సభ బీజీటీఓ హైస్కూల్ టీచర్ కేవీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నవ చైతన్యం తొమ్మిది రోజుల కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. పోటీలకు ఏలూరు నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభకు హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్ల సమన్వయ కర్త కె. జనని స్వాగతం పలికారు. మైక్రో ఆర్టిస్టులు డీ.ప్రసాద్, మేతర సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత అడవి బాపిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మేతర సురేష్ అగ్గిపుల్లలతో చేసిన రామాయణం మైక్రో ఆర్ట్‌ను ప్రదర్శించారు. దసరా సెలవుల్లో శిక్షణ ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జాకబు ఈశ్వరి విజయలక్ష్మి పర్యవేక్షించారు. పోటీ అనంతరం పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు కమిటీ తరపున అందజేశారు.

అభ్యుదయ కవి గురజాడ



విద్యార్థుల సదస్సులో మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి మన్నవ యామిని

ఏలూరు (టూటౌన్): ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు గొప్ప సంఘసంస్కర్త, సాహితీకారుడు, హేతువాది, అభ్యుదయ కవి అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని కొనియాడారు. స్థానిక వెనుకబడిన బాలికల వసతి గృహంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన గురజాడ అప్పారావు 162వ జయంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. గురజాడ తన కవిత, రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరన్నారు. 19, 20వ శతాబ్దం మొదటి దశకంలో అతడు చేసిన రచనలు ఈ నాటికీ ప్రజల మన్నలను పొందుతున్నాయని తెలిపారు. తెలుగు వారు గర్వించే విధంగా గొప్ప దేశభక్తి గీతం గురజాడ రచించారని కొనియాడారు. సంఘ సంస్కరణకు, సాహిత్య సంస్కరణకు గురజాడ తన రచనల ద్వారా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, మహిళా సమాఖ్య నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి

ఏలూరు (టూటౌన్): నగరంలోని కండ్రిగగూడెం, తంగెళ్లమూడి ప్రాంతాల్లోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలని తంగెళ్లమూడి సీపీఎం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. తాపీమేస్త్రి కాలనీ 8వ రోడ్డులో ఆ పార్టీ శాఖా మహాసభ సీహెచ్ దుర్గారావు అధ్యక్షతన ఆదివారం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం శాఖ కార్యదర్శి బి.జగన్నాథరావు మాట్లాడుతూ కండ్రిగూడెం, తంగెళ్లమూడి ప్రధాన రహదారుల్లో రోడ్లు దారుణంగా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. బి.త్రినాథ్, బి.శ్రీనివాసరావు, బి.సిద్ధార్థ పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

- మాయ మాటలతో మభ్యపెడుతున్న కూటమి నాయకులు
- వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయ్యింది. నేటికీ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ఒక్కపైసా విడుదల చేసిన దాఖలాలు కానరావడం లేదు. కనీసం రెండు వారాల క్రితం వరదల కారణంగా చేపల చెరువులు నీట మునిగి నష్టపోయిన ఆక్వా రైతులు ఆర్థిక సాయం అందలేదు. ముంపుబారిన పడిన నివాసితులను ఆదుకునే ప్రయత్నాలు చేయలేదు. అయినప్పటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుంచి పచ్చనేతలకు విముఖతను ఎదుర్కొంటున్నారు.

కానరాని స్పందన

పచ్చ నేతలు గ్రామాల్లో చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు. దీంతో నాయకులు సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎం తదితరులతో కలిసి పింఛన్ అందుకుంటున్న వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారు. మాదేపల్లి, కోటేశ్వరదుర్గాపురంలో సంక్షేమ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రజలు నాయకులను ప్రశ్నించారు. దీంతో కూటమి నాయకులు ప్రజలకు మాయ మాటలు చెబుతూ మభ్య పెడుతున్నారు. ప్రచారానికి వచ్చిన నాయకులు తిరుగుముఖం పట్టిన తర్వాత మహిళలు, రైతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను చర్చించుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అమ్మ ఒడి పథకం నేటికీ చంద్రబాబు అమలు చేయలేదని గుర్తు చేస్తున్నారు. రైతు భరోసా పథకం ఇప్పటికీ విడుదల చేయలేదని రైతులు వాపోతున్నారు. కార్పొరేషన్ల ద్వారా వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామంటూ నమ్మించి, ఇప్పుడు పట్టించుకోవడం లేదంటూ యువకులు టీడీపీ నాయకులను తిడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్నామని గుర్తు చేస్తున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే పథకాలు అమలు చేసిన నాడు పుల్ల పెడతారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలన భేష్

కూటమి నాయకులు చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆశించిన స్పందన రాలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యం, పాఠశాల అభివృద్ధి, పాలన భవనాలు మొత్తంగా 404 పనులు చేపట్టి రూ.106.40 కోట్లు ఖర్చు చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు వివరిస్తున్నారు. అమ్మ ఒడి, వైఎస్ఆర్ భరోసా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, పెన్షన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ తదితర 26 సంక్షేమ పథకాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.175.20 కోట్లకు పైగా పేదలకు అందించారని గుర్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి. రామారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యా సంవత్సరం ప్రారంభమై మొదటి త్రైమాసికం పూర్తయినప్పటికీ పదవ తరగతి విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో పబ్లిక్ పరీక్షలు రాసే అవకాశం ఉందో లేదో తెలియక పోవడం శోచనీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీ. రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఏలూరులోని ఇప్టూ కార్యాలయంలో రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. 40 కిలోమీటర్ల పరిధి దాటి చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్లను రద్దుచేసి ఆ పాఠశాలకు ప్రత్యామ్నాయలను ఏర్పాటు చేయాలని కోరారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ నూతన పీఆర్సీని 2023 జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేయవలసి ఉన్నందువలన వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పీఆర్‌సీ బకాయిలను, పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని కోరారు. ఫైనల్ పేమెంట్లను వెంటనే ఇవ్వాలని, ప్లస్ 2 పాఠశాలలకు ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ యాజమాన్యంలోని ఆశ్రమ పాఠశాలలకు రెండవ ఇంగ్లీషు పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జిల్లా సబ్ కమిటీ సభ్యులు బి.శ్యాంసుందర్, ఎస్.దొరబాబు, కేఎస్ఎస్ ప్రకాష్ రావు, కేఎల్ఎస్ రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.భాస్కర వర్మ, వివిధ మండలాల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు పునరంకితం కావాలి



సమావేశంలో పాల్గొన్న లయన్స్ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ గ్లోబల్ యాక్షన్ టీం ద్వారా లయన్స్ ఇంటర్నేషనల్ విధి విధానాలను అర్థం చేసుకొని సేవా కార్యక్రమాలకు పునరంకితం కావాలని లయన్స్ సభ్యులకు లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు సూచించారు. స్థానిక గ్రీన్ సిటీలోని లయన్స్ జిల్లా భవనంలో ఆదివారం వేణుబాబు అధ్యక్షతన గ్లోబల్ యాక్షన్ టీమ్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్‌లో సభ్యత్వం పొందటం ఒక సదవకాశమని, దీనిని ఉపయోగించుకుంటూ సభ్యులందరూ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కి తమకు తోచినంత విరాళాలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ప్రతిపాదించబడిన పి.సుభాష్ బాబు మాట్లాడుతూ మన జిల్లా ప్రపంచంలోనే ఉన్నతమైన ప్రమాణాలతో సేవలు అందిస్తున్న జిల్లాగా అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, మల్టిపుల్ కౌన్సిల్ సర్వీస్ కో-ఆర్డినేటర్ మూల్పూరి ఉపేంద్ర, మొదటి ఉప గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, రెండవ ఉప గవర్నర్ డీ.సుబ్బారావు,లయన్స్ జిల్లా గాట్ నాయకులు వీ. సత్యస్వరూప్, ఎల్. వెంకటేశ్వరావు, నందుల సీతారామారావు, జిల్లా పూర్వ గవర్నర్ వీకే పంకజక్షన్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సంజ్ఞ భాషా దినోత్సవం



స్థానిక దొండపాడులోని పరివర్తన్ పాఠశాలలో కేక్ కట్‌చేసిన ఏడీ బి.రామ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ సంజ్ఞ భాషా దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దొండపాడులోని పరివర్తన్ పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ముందుగా కేక్‌కట్ చేసి బధిరులకు సైన్ లాంగ్వేజ్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. వినలేరు, మాట్లాడలేని వారికి సమాచారం అందించేందుకు పుట్టిందే ఈ సంజ్ఞ భాష అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా సంకేత భాషలున్నాయని వాటి ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ వాటిపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. చెవిటి వారు వ్యక్తుల పేర్లకు ప్రత్యేక సంకేతాలు వాడుతారన్నారు. ఫలితంగా వారు పూర్తిపేరును చూపించకుండానే ఆ పేరు ఏంటన్నది బధిరులకు అర్థమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతర్జాతీయ సంజ్ఞ భాషల దినోత్సవం 6వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 7 కోట్ల మందికి పైగా బధిరులు ఉన్నారని తెలిపారు. వారు 300కు పైగా సంకేత భాషల్ని వాడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

లెదర్ ఇండస్ట్రీని అభివృద్ధి బాటలో నడిపించాలి

ఏలూరు (టూటౌన్): నిర్వీర్యమైన లెదర్ ఇండస్ట్రీ సంస్థను పటిష్ట పరిచి దానికి సంబంధించిన ఆస్తులను పరిరక్షించి, అభివృద్ధి బాటలో నడిపి పూర్వవైభవం తీసుకు రావాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలిమేర హరికృష్ణ కోరారు. స్థానిక గన్‌బజార్‌లోని సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. దశాబ్దాల తరబడి చర్మకారుల జీవనస్థితిగతులు చాలా అధ్వానంగా ఉన్నాయని, దేశ విదేశాలకు తోలు ఎగుమతి లేక తోళ్ల పరిశ్రమలు మూతబడి చర్మకారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం తోలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవన్నారు. గతంలో ఏలూరులో తోళ్ల పరిశ్రమలు ఉండేవని, కాలక్రమంలో అవి మూతబడి పోయాయన్నారు. దశాబ్దాల తరబడి ఆ వృత్తిలో జీవించిన వారు వివిధ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మినీ లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని, తద్వారా చర్మకారుల జీవన ఉపాధికి బాటలు వేయాలన్నారు. ఈ ప్రతిపాదన లెదర్ ఇండస్ట్రీకి ఉందన్నారు. త్వరలో చర్మకారుల జాతీయ సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు హరికృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నారపాము కిషోర్, గంటాటి రమేష్, వేల్పుల కాటయ్య, చొటపల్లి ప్రసాద్, చింతాటి వెంకన్న పాల్గొన్నారు. శ్రీపర్రు మాజీ సర్పంచ్ చొటపల్లి ప్రసాద్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వ ప్రచారానికి ప్రజా స్పందన కరవు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రచారం చేసుకోవడానికి నిర్వహిస్తున్న మాది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఏలూరు నియోజకవర్గంలో నిస్తేజంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం స్థానిక చోడిదిబ్బలో పర్యటించగా అక్కడి ప్రజల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. డివిజన్లోని కొద్ది ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాము చేసిన అభివృద్ధి కంటే గత ప్రభుత్వంపై విమర్శలకే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. దీనితో స్థానిక ప్రజలు ఇప్పటి వరకూ ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశారో చెప్పలేదని గుసగుసలాడుకున్నారు. ఎమ్మెల్యే ప్రసంగం ముగించి తమ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయం చెప్పాలని స్థానికులను అడిగారు. అయితే ప్రజల నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. దీనితో మాజీ డిప్యూటీ మేయర్ ఒకరు అందుకుని సూపర్ సిక్స్ పథకాలు ఇంకా వారికి అందలేదు కదా అందుకనే వారి నుంచి స్పందన వస్తున్నట్లు లేదని చెప్పడంతో వేదికపై ఉన్న ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులు అవాక్కయ్యారు. కార్యక్రమం ముగిసిన తరువాత ఏర్పాట్లపై ఎమ్మెల్యేను అడిగి తెలుసుకుందామని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కారులోకి ఎక్కి ఆయనతో ప్రయాణిద్దామని ప్రయత్నించగా ఆయన అప్పటికే వైఎస్సార్‌సీపీ వలస నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్‌ను తన కారులో ఎక్కించుకుని వెళ్లడంతో ఇంత ఖర్చు పెట్టి కార్యక్రమం నిర్వహించినా వలస నాయకులకే ప్రాధాన్యత ఇవ్వడంతో వారు కినుక వహించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	234
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	72	చిక్కుడు కాయలు	60-140
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07,10
బెండకాయలు	32	కంద	50
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	38
కాకర కాయలు	34-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	40-60	పాలకూర	15
దొండకాయలు	48	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనపకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58